క్లుప్తంగా

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



ఆయేషాకు చెక్కులు అందచేస్తున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా పోలీసుశాఖలోని ఆర్ముడు రిజర్వ్‌లో ఎస్‌ఐగా పనిచేస్తూ చనిపోయిన మహమూద్ కుటుంబానికి ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆర్థిక సాయం అందచేశారు. 2021లో అనారోగ్యం కారణంగా మహమూద్ చనిపోయారు. ఆయన కుటుంబానికి ఐడీఆర్ఎఫ్ ఫండ్ నుంచి రూ.లక్ష, ఫ్లాగ్ ఫండ్ నుంచి రూ.25 వేలు, విడో ఫండ్ నుంచి రూ.50 వేల చొప్పున మొత్తం ఆర్థికసాయాన్ని మృతుడి భార్య ఆయేషాకు మంగళవారం చిత్తూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో అందచేశారు.

వరసిద్ధుని సేవలో ఎస్పీ

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని చిత్తూరు జిల్లా ఎస్పీ రిషాంత్ రెడ్డి కుటుంబ సమేతంగా మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్ స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

హైరిస్క్ గర్భవతులపై నిర్లక్ష్యం వద్దు



మాతృమరణాలపై సమీక్షిస్తున్న డీఐఓ

చిత్తూరు రూరల్: హైరిస్క్ గర్భవతుల విషయంలో నిర్లక్ష్యం వద్దని డీఐఓ రవిరాజు అన్నారు. మాతృ మరణాలపై మంగళవారం ఆయన చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సమీక్షించారు. సుఖప్రసవం సంఖ్యను పెంచేలా చూడాలన్నారు. ప్రసవ సమయంలో వైద్యుల నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. మధుమేహం, బీపీ, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించి మెరుగైన వైద్యం అందించాలన్నారు. వైద్య బృందం విధిగా మాతృమరణాలను తగ్గించడానికి కృషి చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో వైద్యాధికారులు ఉషశ్రీ, మీనాకుమారి, శిరీష, రేణుక ప్రభ తదితరులు పాల్గొన్నారు.

మొగిలి శివాలయంలో చండీయాగం



శివాలయంలో చండీయాగం చేస్తున్న అర్చకులు

బంగారుపాళెం: మండలంలోని స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి ఆలయంలో మంగళవారం చండీయాగాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మకు ప్రత్యేక పూజార్చనల అనంతరం ఆలయ ఆవరణలో చండీయాగాన్ని హైదరాబాద్‌కు చెందిన శ్రీవిద్య, మహావిద్య ఉపాసకులు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త బ్రహ్మశ్రీ డాక్టర్ పీవీ. గౌరీశంకర్ గురూజీ, ఆలిండియా పురోహిత్ సంఘం గౌరవ సలహాదారు పాణ్యం శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో అర్చకులు, పురోహితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో వంశ పారంపర్య ధర్మకర్త విజయకుమార్, ఈఓ మునిరాజులు, అర్చకులు గంగాధర గురుకుల్, విశ్వనాథ గురుకుల్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పక్కాగా రీ సర్వే



రీ సర్వేను పరిశీలిస్తున్న జిల్లా సర్వే అధికారులు

యాదమరి: మండలంలో రీ సర్వే పక్కాగా చేయాలని చిత్తూరు సర్వే కార్యాలయ ఏడీ గౌస్‌బాషా ఆదేశించారు. జిల్లా సర్వేయర్ గిరి ప్రకాష్, యాదమరి సర్వేయర్ చిరంజీవితో కలసి ఆయన మంగళవారం ఉదయం మండలంలోని 155 కమ్మపల్లె సచివాలయ పరిధిలో చేస్తున్న రీ సర్వేను పరిశీలించారు. రైతుల సమక్షంలో సర్వే చేసి వారి రికార్డులను సక్రమంగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్వే అధికారులు, సచివాలయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పాలకలలో 'ఫ్యామిలీ డాక్టర్'



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి పూర్ణలత

ఐరాల: మండలంలోని పాలకలలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత 104 వైద్య శిబిరంలో రోగులు, గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి వారి ఆరోగ్యం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవితే లక్ష్యం



గుడిపాల: జగనన్న విద్యాకానుక కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



తవణంపల్లె : తొడతరలో..

- చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

గుడిపాల: విద్యార్థుల ఉజ్వల భవితే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకువెళ్తోందని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం నరహరిపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు మంగళవారం జగనన్న విద్యాకానుక కిట్లను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. జగనన్న గోరుముద్ద, అమ్మ ఒడి, విద్యాకానుక, వసతి దీవెన, నాడు–నేడు..ఇత్యాది పథకాలతో విద్యారంగాన్ని పరిపుష్టం చేస్తున్నారని, తద్వారా కార్పొరేట్ స్కూళ్లకంటే మిన్నగా ప్రభుత్వ స్కూళ్లు ఉంటున్నాయన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ జనార్దన్, ఎంఈఓ రామ్‌నాయక్, ఎంపీడీఓ ఉపేంద్ర, ప్రధానోపాధ్యాయులప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: మండలంలోని తొడతర ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం బాబురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన్ రెడ్డి, అరగొండ బాలికల ఉన్నత పాఠశాలలో హైస్కూల్ తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ హరిబాబు, హెచ్‌ఎం మోహన్ రెడ్డి చేతుల మీదుగా జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

నేడు యాదమరిలో...

యాదమరి: స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు చేతుల మీదుగా బుధవారం ఉదయం 9 గంటలకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓ రుక్మిణి తెలిపారు. జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, ఎంపీపీ సురేష్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

మొగిలీశ్వరునికి రూ 3.56లక్షల ఆదాయం

బంగారుపాళెం: మండలంలోని మొగిలి స్వయంభు శ్రీమొగిలీశ్వర స్వామికి హుండీల రూపేణా రూ 3,56,315 ఆదాయం వచ్చినట్లు ఈఓ మునిరాజులు, వంశపారం పర్య ధర్మకర్త విజయకుమార్ తెలిపారు. మంగళవారం ఆలయంలోని సాధారణ, అన్నదాన హుండీలకు సంబంధించి మూడు నెలల కానుకలను దేవాదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో లెక్కించారు. ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఆణిముత్యాలకు ప్రోత్సాహకాల పంపిణీ రేపు

ఐరాల: నియోజకవర్గ స్థాయిలో ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీలలో ప్రథమస్థానం సాధించిన వారికి ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున, అలాగే పదవ తరగతిలో నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.15 వేలు, ద్వితీయ స్థానం వారికి రూ.10 వేలు, తృతీయ స్థానం సాధించిన వారికి రూ.5 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలను ఇవ్వనున్నట్లు ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం ఉదయం 9 గంటలకు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను పంపిణీ చేస్తారని చెప్పారు.

సంక్షేమ సారథి సీఎం



మడుపోలూరులో ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు సమస్యలు నివేదిస్తున్న మహిళ

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే బాబు

బంగారుపాళెం: రాష్ట్రంలో అర్హులైన వారందరికీ పార్టీలు, వర్గాలు, కులమతాలకతీతంగా సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా నిలిచారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మంగళవారం మండలంలోని నలగాంపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని మడుపోలూరు, దళితవాడ, వసంతాపురం, దామరాకుల వడ్డు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. ఆయా కుటుంబాల్లో వ్యక్తులు పొందిన పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

మురుగునీటి కాలువలు, తాగునీటి ట్యాంకు నిర్మించి పైపులైన్లు వేయాలని, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, వసంతాపురానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని ప్రజలు సమస్యలను ఎమ్మెల్యేకు నివేదించారు. సంబంధిత అధికారులు ఆయా సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

టీడీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

నలగాంపల్లె గ్రామ పంచాయతీ టీడీపీకి కంచుకోటగా ఉన్నా టీడీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోలేదని ఎమ్మెల్యే అన్నారు. వసంతాపురంలో మీడియాతో మాట్లాడారు. పంచాయతీలో రోడ్లు, వీధి లైట్లు, డ్రైనేజీ లేదన్నారు. ఇక్కడ నాయకులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు అభివృద్ధిపై దృష్టి సారించాలని, దళిత ఎమ్మెల్యే అయిన తనను గౌరవించాలని హితవు పలికారు. తాను గ్రామాల్లోకి వస్తే బురద చల్లడం అగ్రకులస్తులు మానుకోవాలని, కాలం మారుతున్నా దళితుల విషయంలో అగ్రకులస్తుల ఆలోచనా సరళి మారకపోవడం దురదృష్టకరమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసే టీడీపీ నాయకులు తమ సీఎం వెంట నడుస్తున్నారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మొగిలీశ్వర, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభునాయుడు, లోకేష్, శంకర్‌నాయుడు, రమణ, విజయ్‌కుమార్, నాదల్, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు మహేంద్ర, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు నాగరాజ, యూత్ అధ్యక్షుడు జగదీష్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ బెన్నురాజ్, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓగా రాజశేఖర్‌రెడ్డి



గుడిపాల: ఎంపీడీఓగా రాజశేఖర్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్ కడప జిల్లా జెడ్పీ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఉపేంద్ర ఏఓగా ఇదే కార్యాలయంలో కొనసాగుతారు.

బంగారుపాళెంలో..



మధుసూదన్‌రెడ్డి

బంగారుపాళెం: బంగారుపాళెం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా మంగళవారం మధుసూదన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు యాదమరి ఈఓపీఆర్‌డి హరిప్రసాద్‌రెడ్డి ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఇక్కడ ఉన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా శంకర్



శంకర్

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా శంకర్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఈ శ్రీధర్ విజయవాడకు బదిలీ అయ్యారు. పూతలపట్టు మండలం నుంచి శంకర్ బంగారుపాళ్యానికి వచ్చారు.

తహసీల్దార్‌కు వీడ్కోలు సన్మానం

యాదమరి:బదిలీపై వెళ్లిన యాదమరి తహసీల్దార్ చిట్టిబాబును కార్యాలయ సిబ్బంది మంగళవారం సాయంత్రం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఆయన తవణంపల్లెకు బదిలీపై వెళ్లారు. కార్యాలయంలోని అధికారులు, వీఆర్‌ఏలు శాలువ కప్పి, జ్ఞాపికలతో సన్మానించారు.

బోయకొండలో జెడ్పీ చైర్మన్ పూజలు



ఆలయంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీబోయకొండ గంగమ్మను జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రమౌళి స్వాగతం పలికారు. ప్రత్యే పూజా కార్యక్రమాల అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. అర్చకులు అమ్మవారి ఆలయ విశిష్టతను వివరించారు. ఆయన మాట్లాడుతూ, ఆలయం వద్ద మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి చారిత్రాత్మకమని కొనియాడారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ, మాజీ సభ్యుడు సభ్యుడు రాయల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భక్తిగీతాల ఆలాపన



భక్తి, జానపద గేయాలు ఆలపిస్తున్న కళాకారుడు రెడ్డెప్ప

తవణంపల్లె: మండలంలోని ఎగువ వెంకటాపురంలో సోమవారం రాత్రి భక్తిగీతాలు, జానపద గేయాల ఆలాపన అలరించింది. తిరుపతిలోని మన సంస్కృతి కళాసంస్థ అధ్యక్ష, కార్యదర్శులు సహదేవ నాయుడు, కలకట రెడ్డెప్ప, శ్రీదేవి కళావేదిక అధ్యక్షులు ఐరాల రాజశేఖర్ ఆధ్వర్యంలో 108 భక్తి గీతాలు, జానపద గేయాలను ఆలపించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓబీసీ మహాసభకు రావాలని ఆహ్వానం



విజయవాడలో సీఎంను కలిసిన బీసీ నాయకులు

చిత్తూరు రూరల్: ఆగస్టు 7న తిరుపతిలో నిర్వహించనున్న జాతీయ ఓబీసీ మహాసభలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రావాలని బీసీ నాయకులు ఆహ్వానించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ రాయలసీమ కో–ఆర్డినేటర్ జ్ఞాన జగదీష్, బీసీ నాయకులు ఈశ్వరయ్య, కేశినేని శంకర్‌రావు, జాజుల శ్రీనివాసులు గౌడ్, తిరుపతి నాగరాజు గౌడ్, హరి గౌడ్ తదితరులు విజయవాడలో సీఎంను ఆయన క్యాంప్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. జాతీయ మహాసభ ఆహ్వాన పత్రికను వారు సీఎంకు అందజేశారు. అలాగే బుద్ధుని ప్రతిమను అందజేశారు.

ఆదర్శ ఉద్యోగులకు నగదు పురస్కారాలు



నగదు పురస్కారాలు అందజేస్తున్న డిపో అధికారి

చిత్తూరు రూరల్: చిత్తూరు ఆర్టీసీ–1 డిపోలో మంగళవారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఈఏడాదిలో విశిష్ట సేవలు అందించిన కండక్టర్ చంద్రయ్య, నాగులు, కే.ఎం రెడ్డి, బాషాను నగదు పురస్కారాలతో సత్కరించారు. అలాగే పలువురు డ్రైవర్లు, సూపర్‌వైజర్లను డిపో మేనేజర్ కృష్ణమూర్తి అభినందించారు.

ఆర్టీసీ ఉత్తములకు ప్రశంసాపత్రాలు



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డిపో మేనేజర్ ప్రశాంతి

పుత్తూరు రూరల్: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన సిబ్బందికి పుత్తూరు ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రశాంతి మంగళవారం ప్రశంసా పత్రాలను అందజేశారు. ఇందులో ఐదుగురు డ్రైవర్లు, గ్యారేజీ, ఏసీడీలో ఒక్కొక్కరు చొప్పున మొత్తం ఏడుగురు ఉన్నట్లు తెలిపారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని మిగిలిన సిబ్బంది సైతం విధి నిర్వహణలో ప్రతిభ కనబరచి ప్రయాణికుల మన్ననలు పొందాలని కోరారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తే డిపోను విజయపథంలో నడపవచ్చని అన్నారు. ప్రశంసాపత్రాలు అందుకున్న వారిలో కేసీ బాబు, ఏతః ప్రసాద్, ఎస్.కరీముల్లా, ఎం.విజయ్‌కుమార్, డి.చంద్రయ్య, ఎస్.అంకయ్య, డి.గోవిందరాజులు ఉన్నారు.

జగనన్న లేఅవుట్లకు విద్యుత్, తాగునీరు



పూతలపట్టు : ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సగిలి షణ్మోహన్

- ఇళ్ల నిర్మాణ పనులు చేయని లబ్ధిదారులకు నోటీసులు
- జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్ ఆదేశం



తవణంపల్లె : నలిశెట్టిపల్లె సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

తవణంపల్లె/పూతలపట్టు/ఐరాల: జగనన్న లేఔట్లకు విద్యుత్, తాగునీరు సరఫరా యుద్ధప్రాతిపదికన చేయాలని, రుణాలు పొంది ఇళ్ల నిర్మాణానికి పూనుకోని లబ్ధిదారులకు నోటీసులు జారీ చేసి పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్ మండల స్థాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం తవణంపల్లె మండలంలో నలిశెట్టిపల్లె సచివాలయం, ఆర్‌బీకే భవనం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అంగన్‌వాడీకేంద్రంలో పంపిణీ చేసే కోడిగుడ్లు, పౌష్టికాహారం, బాలామృతాన్ని, కొత్తగొల్లపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో నాడు–నేడు పనులను, ఆ తర్వాత దిగువ మోదలపల్లెలో జగనన్న లేఅవుట్, పూతలపట్టు మండలంలోని యం.బండపల్లె లేఅవుట్, తలపులపల్లె పశువైద్యశాల, వాటర్ ట్యాంక్, హెల్త్‌సెంటర్, తేనెపల్లె సచివాలయాలను, ఐరాల మండలం చిగరపల్లె సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఆయా సచివాలయాల్లో రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు. సచివాలయాల సిబ్బందికి విధుల పరంగా మార్గదర్శనం చేశారు. ప్రతి సచివాలయంలో సంక్షేమ పథకాలకు సంబంధించి అర్హులు, అనర్హుల జాబితాలను కచ్చితంగా ప్రదర్శించాలన్నారు. హౌసింగ్ లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడారు. జూలై 31లోపు జగనన్న ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలని లేని పక్షంలో ఆగస్టు 1 నుంచి బిల్లులు ఖాతాలలో జమ కావని స్పష్టం చేశారు. స్టీల్, సిమెంట్, ఇసుక సకాలంలో అందజేస్తున్నందున ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు. లేఅవుట్లలో విద్యుదీకరణ పనులు త్వరిగతిన పూర్తి చేసి, నిర్మాణం పూర్తయిన ఇళ్లకు మీటర్లు అమర్చాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. తవణంపల్లె పీహెచ్‌సీలో అసంపూర్తిగా ఉన్న నాడు–నేడు పనులను పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. తిరుపతి– బెంగుళూరు హైవే బైపాస్ రోడ్డు దగ్గర స్థలాన్ని పరిశీలించారు. తవణంపల్లె, పూతలపట్టు ఎంపీడీఓలు హరిప్రసాద్ రెడ్డి, గౌరి, తహసీల్దార్ సుశీలమ్మ, హౌసింగ్ డీఈ నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు, ఏఈ ఈశ్వర్, సర్పంచ్ చలపతి, ట్రాన్స్‌కో ఏఈ కిరణ్, ఎంఈఓ శంకరయ్య, పీఆర్‌ఈఏ గురువారెడ్డి, హౌసింగ్ ఏఈలు శ్రీధర్, సుబ్రమణ్యం, వెలుగు ఏపీఎం నాగరత్న, వ్యవసాయాధికారి ప్రవీణ్, వైద్యాధికారులు ప్రియాంక, మోహన్‌వేలు, సీహెచ్‌ఓ వెంకటరమణ, అధికారులు, సచివాలయ సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యం

తవణంపల్లె: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పైపల్లె ట్రాన్స్‌కో ఏడీఈ సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం టి.పుత్తూరు, తవణంపల్లె సబ్ స్టేషన్లలో విద్యుత్ వినియోగదారుల సమావేశాలు నిర్వహించారు. ఏడీఈ మాట్లాడుతూ, విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. నూతన వ్యవసాయ సర్వీసులకు రైతులు దరఖాస్తు చేసుకొన్న నెల వ్యవధిలోనే మంజూరు చేస్తామన్నారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్న పక్షంలో వెంటనే మరమ్మతులు చేస్తామన్నారు. తవణంపల్లెలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందని గ్రామస్తులు ఏడీఈ దృష్టికి తీసుకొచ్చారు. అదనపు కరెంటు స్తంభాలు, వేలాడుతున్న కరెంటు తీగలు తొలగించాలని రైతులు కోరారు. దీనిపై స్పందించిన ఏఈడీఓ తవణంపల్లెలో గ్రామస్తులు సహకరిస్తే రెండు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. సమావేశంలో పైపల్లె ఏఈ కిరణ్ కుమార్, ట్రాన్స్‌కో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు స్టాండింగ్ కమిటీ ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ అముద, కమిషనర్ అరుణ తదితరులు

చిత్తూరు అర్బన్: చిత్తూరులో పలు అభివృద్ధి పనులకు మునిసిపల్ కౌన్సిల్ స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం మంగళవారం సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించారు. నగర మేయర్ ఎస్.అముద, కమిషనర్ డాక్టర్ అరుణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు, డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, ఆర్‌జి.శ్రీకాంత్, సి.శోభ, బి.పూర్ణ చంద్రరావు సమావేశానికి హాజరయ్యారు.

అజెండా అంశాలుగా..

వాయు కాలుష్యాన్ని తగ్గించే చర్యల్లో భాగంగా నగరపాల సంస్థ వినియోగిస్తున్న పెట్రోల్ /డీజిల్ కార్ల స్థానంలో రెండు ఎలక్ట్రిక్ కార్లను కొనుగోలు చేయడానికి స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. జాతీయ స్వచ్ఛమైన గాలి కార్యక్రమంలో భాగంగా 2022–23లో మంజూరైన నిధులు ఖర్చు చేయడానికి, సాధారణ నిధుల నుంచి తాగునీటి మోటార్లు కొనుగోలు చేయడానికి ఆమోదించారు. టేబుల్ అజెండా ద్వారా తిరుపతి–చిత్తూరు మార్గంలో ఆర్చ్ నిర్మాణానికి, సబ్‌మెర్సిబుల్ పంపుసెట్ల కొనుగోలుకు, పలు వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. సమావేశంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, మునిసిపల్ ఇంజినీర్ వెంకట ప్రసాద్, ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్, ఏసీపీ రామకృష్ణుడు, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, సీఎంఎం గోపి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గంగమ్మ సేవలో ఎమ్మెల్యే



గంగజాతరలో ఎమ్మెల్యే శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: చిత్తూరులోని చౌటపల్లెలో గంగజాతర వైభవంగా నిర్వహించారు . ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారిని కర్పూర హారతితో దర్శించుకున్నారు. జాతర నిర్వాహకులు ఆయనను సన్మానించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గంగజాతర

చిత్తూరు రూరల్: చిత్తూరులోని 8వ డివిజన్, తిమ్మసముద్రంలో మంగళవారం గంగజాతర ఘనంగా నిర్వహించారు. వేకువజామునే గంగమ్మను ఆయా వీధుల్లో కొలువుదీర్చి సంప్రదాయబద్ధంగా తొలిపూజ చేశారు. అనంతరం భక్తులు అంబలి పోసి మొక్కులు చెల్లించారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి 8వ డివిజన్, తిమ్మసముద్రంలో కొలువైన గంగమ్మను దర్శించుకున్నారు. జాతర పెద్దలు ఆత్మీయ స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.

189కొత్తపల్లెలో..

గుడిపాల: మండలంలోని 189 కొత్తపల్లె ఆదిఆంధ్రవాడలో మంగళవారం గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఉదయం మహిళలందరూ ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి అంబలి పోశారు. మొక్కులు చెల్లించారు. సాయంత్రం పొంగళ్లు పెట్టారు. రాత్రి అమ్మవారిని మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు. రాత్రి వీధినాటకం ప్రదర్శించారు.



తిమ్మసముద్రం జాతరలో ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి



గుడిపాల : భక్తులకు దర్శనమిస్తున్న గంగమ్మ

పిడుగుపడి కొబ్బరి చెట్టుపై మంటలు

సదుం: మండలంలోని నడిగడ్డ గ్రామంలో మంగళవారం సాయంత్రం పిడుగుపడింది. గ్రామంలో ఉరుములతో కూడిన వర్షం కురిసింది. గ్రామ సమీపంలోని చాకలివానికుంట ఎదురుగా ఉన్న మామిడితోటలోని కొబ్బరి చెట్టుపై పిడుగు పడడంతో మంటలు రేగాయి. స్థానికులు తొలుత భయాందోళనకు గురయ్యారు. ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.